# "కలిసిన రేఖలు"

మనోహరం పేదవాడు కాడు. కొద్దో గొప్పో ఉన్నవాడు. బియ్యే పాసయ్యాడు. తల్లీ దండ్రీ లేరు. తను పుట్టిన కొద్ది రోజులకే తల్లి చనిపోయింది. తర్వాత కొద్ది మాసాల్లోనే తండ్రీ గతించాడు. అన్నయ్యే కుటుంబసంరక్షణ భారం వహించాడు. అన్నయ్యా వదినెలు అతణ్ణి పెంచి పెద్దజేసి చదివించారు. వదినకు మనోహరమంటే గిట్టదు. ప్రతి నిముషం ఏదోఒకటి చెప్పి కష్టపెట్టేది. ఏనాడూ ఆదరంతో చూడలేదు. పగవాణ్ణి చూచినట్లు చూసేది. అన్నయ్యఎంతో ప్రేమతోచూశాడు...! కానీ...ఆయన ఇటీవలే హృద్రోగంతో చనిపోయాడు. ఇక అక్కడ వుండలేకపోయాడు. పొరుగూరొచ్చి ఒక గది అద్దెకు తీసుకొని, మంచి ఉద్యోగంకోసం ప్రయత్నాలు జరుపుతూ, కాలక్షేపం చేస్తున్నాడిప్పుడు. ఆ వూళ్ళో కొంతమంది బంధుమిత్రులున్నారు. అన్నయ్య ఆ వూళ్ళో ఉద్యోగంలో వున్నప్పుడు ఇక్కడ ఐదు, ఆరు ఫారాలు చదివాడు. ఆ వూరతడికి బాగా నచ్చింది.

ఎదురింట్లో విశ్వేశ్వరయ్యగారని ఒకాయనవున్నారు. ఆయన ఏదో చిన్న ఉద్యోగంచేసి రిటైరయ్యారు. కొద్దిగా పొలం వుంది. చేతిలో డబ్బు రూపంలో ఏమీ లేదు. తన కూతురుకు వెయ్యిరూపాయలు కట్నమిచ్చి, హాయిగా బ్రతక

గల వ్యక్తికే యిచ్చి పెళ్ళి చేశారు—మనోహరం రోజూ "ఇంగ్లీష్ డైలీ" తెప్పిస్తుంటాడు. పత్రిక చూడటానికి విశ్వేశ్వరయ్యగారు రోజూ మనోహరం గదికి వస్తూవుంటారు. పత్రిక చదివినతర్వాత ఒకో రోజు కబుర్లలో పడ్డం కూడా కద్దు.

ఒక రోజు మధ్యాహ్నం మూడు గంటలప్పుడు, మనోహరం గదికి విశ్వేశ్వరయ్యగారొచ్చి పడక కుర్చీలో కూర్చున్నారు పత్రిక చూస్తూ.

"తాతగారూ మనింట్లో కనిపించే ఆ అమ్మాయిగా రెవరండీ" అని...అడగలేక...చివరికి అడిగేశాడు. తాత గారు తలెత్తి, ఒక నిముషం, తాపీగా మనోహరం, ముఖం లోకి చూశారు.

"చెప్తాను కానీ...ముందు నే చెప్పేకథ వినాలి. కథను బాగా ఆలోచించి అర్థంచేసుకోడానికి ప్రయత్నించు. "ఒక అమ్మాయి...,పేరు సుమిత్ర. సుమిత్ర పుట్టిన కొంత కాలానికే తల్లి చనిపోయింది. తండ్రి రెండో పెళ్ళి చేసు కొన్నాడు..." తాతగారు కథ చెపుతున్నారు. మనోహరం ఆలోచిస్తున్నాడు తను పుట్టిపెరిగిన పరిస్థితులకూ, ఈసుమిత్ర పుట్టిపెరిగిన పరిస్థితులకూ కొంత సామ్యం వున్నట్లుందే! సుమిత్ర పెరిగిన వాతావరణం కూడా విచిత్రమైనదేకావాలి. అందుచేత సుమిత్ర పరిస్థితిని, తను సులభంగా అర్థం చేసుకో వచ్చు—కథ నడుస్తోంది...

"—సవతితల్లి, తండ్రిని బాగా వలలో చిక్కించు కొంది. ఆమె చెప్పినట్లల్లా ఆయన నడుచుకొన్నాడు. సుమి

త్రను ఆ మహాతల్లి ఒక పనిమనిషిగా ఉపయోగించుకోవాలనుకొన్నది—" అప్పుడు మనోహరం—సరిగా తన వదిన కూడా తన్ను ఇలాగే ఉపయోగించుకోవాలనుకుందిగా—అనుకొన్నాడు. "—థరుడుఫారం చదువుకొంటున్న సుమిత్రను, బడి మానిపించాలని చూసింది. నిజానికి ఆమె కూడా కొంతవరకు చదువుకొన్నదే! అయినా...ఆమె అన్నది... ఆడవాళ్ళు ఎక్కువగా చదువుకొంటే గర్విష్ఠులవుతారన్నది. ఈరత్తోనే అనుకో... రేపు ఒకరింటికి పంపించాలి గనక, ఇప్పట్నుంచీ వంటా వార్పూ...నేర్పించాలన్నది. అదీగాక ఎక్కువగా చదివిస్తే, తర్వాత ఆమెకు బోలెడు కట్నమిచ్చి పెళ్ళి చేయాల్సి వస్తుందన్నది. ఆమె పెళ్ళికే కొంప మునిగిపోతుందని, ఆయన బుర్ర కెక్కించింది! అయినా...థరుడుఫారమైనా పూర్తవకముందే మాన్పించడం, ఆయనకూ ఇష్టంలేదు. అందుకని "ఈతరగతి పూర్తి కానీలే...చూద్దా" మన్నాడు. ఆమె అనుకొన్నదీ...ఆశించినదీ కూడా అంతే! ఆ మాట ఆయన్నుంచి రాబట్టడానికే ఆమె ప్లానంతా! వచ్చేఏడునుంచి మూల కూచోబెట్టాలనే తలంపుతోనే ఇప్పట్నుంచీ ఉద్యమం ప్రారంభించింది, తెలివిగల పిల్లే!

అదివరకు ఫస్టు మార్కులు తెచ్చుకొనే సుమిత్ర ఆ ఏడు గండం గడచి పిండం బయట పడినట్లు, ఎలాగో పాసయిం దనుపించుకొంది. తర్వాత జరిగిన రాద్ధాంతం ఇంతా అంతా కాదు. స్కూలు తెరిచిన రోజు ఇంట్లో పని కావలసినంత పెట్టేసింది. ఎక్కడికీ కదలటానికే వీలులేకుండా

చేసేసింది. డిసెంబరులో పుట్టినమనిషి జన్మదినం జూన్‌లో ఎలా వచ్చిందో దేవుడికి తెలుసు. ఆ రోజు సుమిత్రకు చల్లగా చెప్పేసింది తల్లి—నిన్ను స్కూలు మాన్పించేస్తున్నామూ—అని.

సుమిత్ర ఏడవడం ప్రారంభించింది. ఎలాగో తప్పించుకొని స్కూలుకు వెళ్ళిపోయింది. తర్వాత తండ్రి కూడా చెప్పాడు. సుమిత్ర వినలేదు తిండీ నీళ్ళూ మానేసి ఏడుస్తూ పడుకొంది. చివరికి తండ్రికి దయకలిగింది. పోనీ ఈ ఏడు చదవనీ లే...ఇంకా చిన్నపిల్లేగా..." అని భార్యకు నచ్చజెప్పాడు. దీన్ని తన కొక గొప్ప పరాజయంగా భావించిందామె. అప్పటినుంచీ రోజూ ఇంట్లో బోలెడు పనులు చెప్పి, బాగా చాకిరీ చేయించుకొనేది. చదువుతూవుంటే...తిట్టూ ప్రక్కన నిల్చునేది అలాంటప్పుడు ఆ చదువు బుర్రకెలా ఎక్కుతుంది? కొద్ది రోజుల తర్వాత ఆమె కో కొడుకు కలిగాడు. ఆమె ఆ బిడ్డకోసం వేరే ఒక పనిమనిషిని పెట్టుకోలేదు. సుమిత్రే...ఆ బిడ్డ భారం వహించాల్సి వచ్చింది. చదువు ప్రారంభించేసరికి బిడ్డను తెచ్చి అందిచ్చేది. ఇక చచ్చినట్లు బిడ్డను అందుకోవాల్సిందే. ఆ కుర్రవాడు ఏడవటం కూడా సుమిత్ర తప్పే అయ్యేది. బిడ్డ ఏడుస్తే, సుమిత్ర కూడా ఏడవక తప్పదు. ఠక్ మని ఒక మొట్టు మొట్టిందంటే కళ్ళ నుంచి బొటీమని నీళ్ళు కారేదట.

ఉదయం అయిదింటికల్లా లేపి, పని పురమాయించేది. అన్ని పనులూ చేసిపెట్టి స్కూలుకు వెళ్ళడానికే కష్టమైపోయేది. సాయంకాలం స్కూలునించి వచ్చినప్పట్నించి

రాత్రి తొమ్మిదింటివరకు చేతినిండుగా పని వుండేదట వంటింట్లో. అప్పుడు యిక చదువేం సాగుతుందీ? అలసి పోయి నిద్రపోయేది. మళ్ళీ ఉదయం లేవాలి కదా! ఇలా ఆ ఏడంతా గడచిపోయింది. ఆ ఏడు సుమిత్ర పరీక్షల్లో ఫేలయింది. మళ్ళీ బడికి వెళ్తానంటే—

"ఈ మొద్దు మొహానికి చదువొకటా! ఫేలయ్యావుగా- చాలదూ! ఇంకా చదువెందుకూ?" అని వెక్కిరించిందా తల్లి. ఆ తల్లినీ, తండ్రినీ ఎదిరించడానికి సుమిత్రకు బలం లేకపోయింది. తను ఫెయిలవడానికి కారణం సుమిత్రకు తెలుసు. అయినా ఆ సవతి తల్లితో ఏమని వాదిస్తుంది? తండ్రి తన మాటే వినిపించుకోడు. ఆయనకు నిజానికి కుమార్తె మీద అనురాగం వుండొచ్చు. కానీ పడుచు భార్యమీద వున్న ప్రేమ వేరు- మొదటి భార్య కూతురిమీది అభిమానం వేరూ!

సుమిత్ర ఆలోచించింది. తను ఇప్పుడు అందర్నీ ధిక్కరించి స్కూలుకు వెళ్ళొచ్చు. కానీ జీత మెవరు కట్తారు? తాతయ్య కొంత డబ్బు పంపేవాడే. కానీ ఆ విషయం తెలిస్తే ఇంట్లో...వూరికే వుండనిస్తారూ? సవతితల్లి చీల్చి చెండాడెయ్యదూ? కేవలం డబ్బు ఖర్చవుతుందని చదువు మాన్పించడం లేదే! ఇంట్లో చాకిరీ చేయించుకోడానికి బాగా వుపయోగ పడుతుంది. పైగా...ఎక్కువ కట్నం ఇచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడదు. అదీగాక తన సవతి కూతురు చదువరి కావడం, ఆమె కేమాత్రం ఇష్టం లేదు. చదువుకొంటే తన్ను

ఎదిరిస్తుంది; చెప్పినట్లు నడచుకోదు. ఇవే ఆమె భయపడే విషయాలు కావచ్చు.

చాలకాలానికి గానీ...సుమిత్రకయినా తెలియకుండా వుండిన ముఖ్య విషయం మరొకటుంది. ఆమెకు ఒక తమ్ము డున్నాడు. అతడు స్కూల్ ఫైనల్ ఫెయిలయ్యాడు. పోకిరీ అయి, ఆ యింటికే ఆలుకద్దా, ఈ ఇంటికి మొగుడు కద్దా అని తిరుగుతున్నాడు. అలాంటి వాడికి సుమిత్రను కట్టపెట్టా లని ఆమె లోపలి కోరిక. సుమిత్ర స్కూల్ ఫైనల్ వరకూ చదివి నిజంగానే ప్యాసయిపోయి కూర్చుంటే అప్పుడు ఆమెను అతడికి కట్టబెట్టడం అతి కష్ట మవుతుంది. అంతవరకూ వచ్చిన తర్వాత ఆమె కాలేజీకి వెళ్తాననికూడా అనవచ్చు. అప్పటి కామెకు పోట్లాడి, కాలేజీ వెళ్ళడానికి తగిన శక్తికూడా రావచ్చు. అందువల్ల ఆమె బాగా ఆలోచించింది. విపరీతంగా ఏమాత్రం తీరిక సమయం కలిగించకుండా ఏదో ఒక పని చెప్పి, చేయించుకొని చదివే అవకాశం లేకుండా చేసింది. మానసికంగానూ, శారీరకంగానూ సుమిత్రకు ఎంతో క్షోభ కలిగించింది. తత్ఫలితంగా సుమిత్ర ఫెయిలయింది.

చివరికి...సుమిత్ర చదువు మానుకొన్నది. పిన్ని చెప్పినట్లు పని చేయడమే ఆమె నిత్యకృత్యమై పోయింది. పని లేనప్పుడు వూరికే కూర్చువి గడపాలి. ఎన్ని గంటలని అలా ఇంట్లో కూర్చోగలుగుతుంది? ప్రక్కింటికి, ఆ వీధిలోనేవున్న ఒకరిద్దరు స్నేహితురాళ్ళ ఇళ్ళకు ఆమె బయలు దేరేది. ఆమె వారించేది. అలా అందరి ఇళ్ళకూ వెళ్తే, వారి మాటలు విని చెడిపోతుందనీ, తనకు ఎదురుతిరుగుతుందనీ భయం. ఇంత

కుదురయిన పిల్ల తన పుట్టింట వుంటే ఆ యిల్లు, ఎంతో బాగవుతుందని కూడా ఆమె అనుకొనేది. అందుకోసం ఇక్కడ ఇప్పట్నుంచీ మంచి శిక్షణ ఆవసరమని ఆమె భావన.

చాలాకాలంవరకూ సవతి తల్లి పెట్టే బాధలన్నింటినీ సుమిత్ర భరించింది. కానీ...ఎంతదూరం పరుగెడుతుంది? ఆమె అలసిపోయింది. ఇక సహించలేకపోయింది. ఆవిడ పెట్టే బాధలకు హద్దంటూ లేకుండాపోయింది.

ఒకరోజు సుమిత్ర ప్రక్కింటికి వెళ్ళింది. ఎంతోదూరం ఎవరింటికో వెళ్ళలేదు. ఆ ప్రక్కింటివాళ్ళు- ఆమెకు విరోధుల్లాంటివారు. ఇటీవలే ఆమె ప్రక్కింటి సుభద్రమ్మతో బావి దగ్గర పోట్లాడింది. సుమిత్ర ప్రక్కింటినుంచి తిరిగి వచ్చేసరికి ఆమె కస్సుమని లేచింది సుమిత్రమీదికి.

"ఎక్కడికి...చచ్చావే..." అంది. సుమిత్ర మనస్సు చివుక్కుమన్నది.

"ప్రక్కింటికే వెళ్ళాను. అమెరికాకూ వెళ్ళలేదు— ఆఫ్రికాకూ వెళ్ళలేదు" అన్నది.

"ఏమన్నావూ..." అని క్షణం ఆగి...

"ఆ దరిద్రపు కొంపకు ఎవరు వెళ్ళమన్నారే నిన్ను నన్నడక్కుండా ఎందుకువెళ్ళావు. ఉండు...మీనాన్న రానీ చెప్తాను. నీ తోలు వొలిపిస్తాను. అడిగేవాళ్ళు లేకపోతేసరి! నీ యిష్టంగా తీరి కూర్చుంటున్నావు. కుదిరిపోతుంది అని... గట్టిగానే అన్నది.

"ఇకమీదట నువ్వు చెప్పినట్లు నేను వినను. నా యిష్టం వచ్చినట్లు చేసుకుంటాను. నువ్వెవరు...నాకు చెప్ప డానికి! నేను దిక్కూ దివాణమూ లేనిదాన్నని నీ యిష్టం వచ్చినట్లు పేలితే పడతాననుకొన్నావా! ప్రపంచంలో నాకూ దిక్కున్నారులే" అనదలచిన రెండు మాటలూ గబగబా అనేసింది సుమిత్ర.

ఆమె మండిపోయింది. పళ్ళు పటపట లాడించింది. ఓ మూలవున్న అట్లకర్ర తీసి వీపుమీద నాలుగు వాయిం చింది. సుమిత్ర కోపమూ, దుఃఖమూ పట్టలేక ఆమె జుత్తు పట్టుకొంది. ఆమెకు మరీ కోపం హెచ్చింది. ముఖంమీదికి విసిరికొట్టింది. అట్లకర్ర పొడుచుకొని నుదుటిమీంచి రక్తం కారసాగింది. సరీగా ఇదే సమయంలో సుమిత్ర నాన్న వచ్చా డక్కడికి. ఆ దృశ్యాన్ని చూశాడు. సుమిత్ర ముఖం నుంచి కారే రక్తం కనిపించలేదు. సుమిత్ర చేతిలోని పడుచు భార్య జుత్తు మాత్రమే...ఆయనకు కనిపించింది.

"ఇంతవరకూ...వచ్చిందీ కథ" అంటూ జోరుగా వచ్చి సుమిత్ర జుత్తు పట్టుకులాగి, ఆ వీపుమీదే నాలుగు బాదాడు. ఆ దెబ్బలకు తాళలేక ఆమె కేకలు పెట్టింది. నలుగురూ పోగయ్యారు. "చావు...పడి" అంటూ క్రింద పడదోసి వెళ్ళిపోయాడు తండ్రి. సవతితల్లి భర్త విడిపించిందే తడవుగా ఎప్పుడో జారుకొంది. ఆ పక్కింటివాళ్ళే సుమిత్రను ఓదార్చారు. గాయాలకు మందువేసి కట్లు కట్టారు. తమతో ఇంటికి రమ్మని పిలిచారు.

"నేను రాను. ఇది నా యిల్లు. నేను యిక్కడే వుంటాను" అన్నది సుమిత్ర.

ఆ రాత్రి భోజనం చేయకుండా పడుకుంది. లోపల ఆకలి దహించి వేస్తున్నా గమనించలేదు. ఆ రాత్రి తండ్రీ సవతి తల్లీ తన పెళ్ళిగురించి మాట్లాడుకొంటూ వుంటే విన్నది.

"దీన్ని వెంటనే ఎవరికో ఒకరికి...కట్టబెట్టేయాలి తీరికూర్చుంటోంది. నేను దీనితో వేగలేను. ఇక అది నా అదుపులో వుండదు. దీన్ని ఏదోవిధంగా వదుల్చుకుంటే చాలు. ఇంటినుంచి పంపిస్తేచాలు. విరగడయిపోతుంది. దీనితో ఒక్క రోజు కాదు గదా...ఒక క్షణం కూడా నేను పడలేను. దాని మొగం చూస్తేనే డోకేస్తుంది...ఛీ ఛీ... అన్నది" భార్య.

"అవును గానీ...ఇంకా పసిపిల్ల గదా" అన్నాడు భర్త.

"ఇంకా పసిపిల్లేమిటండీ. రెండు వేల కట్నమిస్తే చాలు. ఎవడో ఒకడు చేసుకొంటాడు" అన్నది భార్య.

"నీ ముఖం! రెండు వేలకు ఎవరు చేసుకొంటారు. చేసుకొంటే, ఇంకేం. రేపు ఉదయమే కానిచ్చేయనూ" అన్నాడు భర్త.

"ఆ విషయం నా కొదలండీ! దానికి భర్తను చూసే భారం నాదీ" అన్నది భార్య.

"ఎవ రేమిటే" అన్నాడు తన కేమో తెలిసిపోయి నట్లు.

"మావాడే వున్నాడు గదండీ! ఎవరో ఎందుకూ" అన్నది భార్య.

"ఆ...మీవాడా...వాడా..." మరికొన్ని మాటలు వినిపించలేదు.

"కట్నం రెండువేలు చాలు కదా" అన్న మాట మాత్రం వినిపించింది.

ఇంకేం! తండ్రి కూడా ఒప్పుకున్నట్లే! ఆ సవతితల్లి తమ్ముణ్ణి గురించి సుమిత్రకూ తెలుసు. ఒకసారి ఇంటికివచ్చి వారం రోజు లున్నాడు. అప్పు డతడు చేసిన వెకిలి చేష్టలు వర్ణనాతీతం. సుమిత్ర మరచిపోలేదు. అతడంటే ఆమె కెంతో అసహ్యం. ఒక బండ రాయినైనా చేసుకోవచ్చుగానీ, అతణ్ణి మటుకు చేసుకోరాదని ఆమె నిశ్చయం.

ఆమెకు దుఃఖమూ, సవతి తల్లిమీద కోపమూ ఉవ్వెత్తున ముంచుకొచ్చాయి. హాలులో గోడకు వేలాడుతున్న తల్లి ఫోటో కేసి చూసింది ఆ చీకటిలో ఏమీ కనిపించలేదు. లేచి ఫోటో దగ్గరకు నడిచింది. దణ్ణం పెట్టింది. ఆ ఫోటోను తీసి హృదయానికి హత్తుకొంది. హాల్లోనే ఒక అలమరలో చిల్లర మల్లర ఖర్చులకోసం కొంత చిల్లర డబ్బుంటుంది. రెండు రూపాయలుంది. ఆ డబ్బునూ, ఫోటోను పుచ్చుకొని అర్థరాత్రిలో ఆ యిల్లు విడిచి బయలుదేరింది. చూడుబాబూ! ఆడవాళ్ళను అబల లంటారు-, చూశావూ! సమయం రావాలే కానీ, ఈ ఆడవాళ్ళు యెంత ధైర్యంగా నైనా ప్రవర్తిస్తారు- ఆమె సరాసరి ఎక్కడికి వెళ్ళిందో తెలుసా. ఎక్కడికీ వెళ్ళ లేదు...ఈ వూరే వచ్చింది. ఈ ఎదురింటికే వచ్చింది. ఆమె

తాతయ్యను నేనే! విన్నావూ కథ" అని వెనక్కి వాలేరు విశ్వేశ్వరయ్యగారు. మనోహరం నిట్టూర్చాడు.

విను...ఇంకా వుంది. ఇక్కడ కొచ్చిన తరువాత... కొంతకాలం హాయిగానే గడచిపోయింది. ఇంతవరకూ...ఆ తల్లీ తండ్రీ వచ్చి చూచిపోయిన పాపాన పోలేదు. నేనే సుమిత్రకు పెళ్ళిచేయాలని చూస్తున్నాను. కానీ కట్నమిచ్చు కోలేను. ఇదే సమస్య. తండ్రిమీద దావా వేయొచ్చు. అందుకయినా ప్లీడర్ల కిచ్చుకోడానికి డబ్బు కావాలిగా! నేను పేదవాణ్ణి. ఏం చేయగలను. చివరికి నా చిట్టితల్లి జీవితం ఏమవుతుందోనని బెంగగావుంది. వీళ్ళమ్మ...లాగే, సుమిత్ర కూడ చాల అణకువయిన పిల్ల. ఎవరు చేసుకొన్నా, ఆ కుటుంబం కళ కళ లాడుతుంది. నాకు ముగ్గురే బిడ్డలు. ఇంకో కూతుర్ని ఒక బడి పంతుల కిచ్చి పెళ్ళి చేశాను. వాళ్ళు హాయిగా బ్రతుకుతున్నారు. కొడుకు నాలాగే ఈ వూళ్ళోనే తాలు కాఫీసులో గుమస్తాగా వుంటున్నాడు. వాడు తెచ్చే జీతం వాళ్ళ చిల్లర ఖర్చులకే చాలడం లేదు...ఏదో యిలా...నా శేష జీవితాన్ని సాగించేస్తే, ఆ తర్వాత అంద రికీ ఆ దేవుడే దిక్కనుకొన్నాను. ఇప్పుడీపిల్ల ఒక సమస్య యింది. అయినా...నేను దిగులు పడటం లేదు. అన్నిటికీ, జగద్రక్షకుడు, ఆపద్బాంధవుడు అయిన శ్రీమన్నారాయణ మూర్తి వుండనే వున్నాడు. ఎప్పుడో కన్ను తెరుస్తాడు...! సరే, నే వస్తాను బాబూ! తర్వాత మాట్లాడుదాంలే..." అని లేచి వెళ్ళిపోయాడు.

మనోహరాన్ని సుమిత్ర కథ బాగా కదలించివేసింది. తను జీవితంలో ఏదో సాధించగలననే ఆశమీద మనోహారానికి లేదు. కనీసం ఈ అమ్మాయికైనా ఏదో చేద్దామనుకున్నాడు. నిజానికా అమ్మాయి అందంగానే వుంది. దాదాపు తన పరిస్థితుల్లోనే పెరిగింది. ఒకరి నౌకరు సులభంగా అర్థంచేసుకొని మెలగొచ్చు. చక్కని తెలివితేటలు మంచి నడవడి కలదిగాకూడా కనిపిస్తుంది. తన స్వార్థం కోసమైనా సుమిత్రను పెళ్ళి చేసుకోవచ్చు. ఇది ఉభయాత్రా మంచిదే. ఇందు మూలంగా, ఆమెకు మేలు జరుగుతుంది. తనూ బాగుపడతాడు. ఈ వేషాలన్నీ మానేసి, ఏదో ఒక ఉద్యోగం చూసుకొని, హాయిగా బ్రతికిపోవచ్చు. తనకిప్పుడు స్వగ్రామంలో ఒక ఇల్లు మటుకే వుంది. అద్దెకిస్తే, కొంత డబ్బు రాకుండాపోదు. ఉన్న డబ్బూ వగైరా ఆ రోజే— పంచేసుకొన్నారు.

ఎలాగైనా సుమిత్రను, విశ్వేశ్వరయ్యగారిని మంచి చేసుకోవాలనే నిశ్చయించాడు మనోహరం, తను ఎవరినుంచి అయినాసరే కానీ కట్నం తీసుకోరాదని, మొదటినుంచీ అనుకొంటున్నాడు. ఈ అమ్మాయే గనక తన్ను చేసుకోడానికి సిద్ధపడిన పక్షంలో, తనే శుల్కమిచ్చి అయినా—చేసుకోవచ్చు ననుకొన్నాడు! ఇదే ప్రస్తుతానికి తన ఆశయమని దృఢంగా నిశ్చయించుకొన్నాడు.

నాలుగు రోజులు గడిచాయి. ఒకనాటి సాయంకాలం సుమిత్ర ఇంట్లో చెప్పకుండా, మామూలుగా— ఆ వీధిలోనే వున్న స్నేహితురాలింటికి వెళ్ళింది. అక్కడ చాలసేపు గడి

పించి. ఆ ఇంట్లో అందరూ ఆ రాత్రి సినిమాకు వెళ్ళాలను కొన్నారు. సుమిత్ర స్నేహితురాలు సరోజిని, సుమిత్రను కూడా సినిమాకు రమ్మని బలవంత పెట్టింది ఇంటికి వెళ్ళి చెప్పొస్తానన్నా, వినకుండా తమతోపాటు తీసుకెళ్ళిపోయారు స్నేహితులు.

రాత్రి ఎనిమిదైనా అమె ఇంటికి రాకపోయేసరికి ఇంట్లో గాభరాపడ్డారు. దారిలో తండ్రిగాని కనిపించి అలాగే లాక్కుపోయాడేమోననికూడా అనుమానించారు. కొంత సేపు వేచి చూశారు. ఇక వుండలేక 'టార్చిలైట్' తీసుకొని విశ్వేశ్వరయ్యగారు మనోహరం గదికి వచ్చారు.

"అబ్బాయ్ మనోహరం! మా అమ్మాయి ఎక్కడికో వెళ్ళి ఇంతవరకు తిరిగి రాలేదు. నువ్వో కాస్త వస్తావూ. చూసొద్దాం నాయనా!" అన్నారు.

"ఎంతమాటా! ఇదిగో వచ్చేస్తున్నానండీ-" అంటూనే లేచి వచ్చాడు మనోహరం.

ఇద్దరు చెరోవేపు బయలుదేరారు. స్నేహితుల ఇళ్ళకు వెళ్లారు విశ్వేశ్వరయ్యగారు. సుమిత్ర ఏం చేసిందో, అదే తట్టింది మనోహరానికి!

ఫస్టు షో లైపొయింది! సినిమా వదిలారు. మనుష్యులు కదిలారు సినిమా నుంచి! ఆడవాళ్ళ గేటుముందు నిల్చు న్నాడు మనోహరం. సుమిత్ర మరో అమ్మాయి సరోజినీ, ఒక నలభై యేళ్ళ ఆవిడ, బహుశా సరోజని అమ్మ కావచ్చు. ఒక యువకుడు బయటకు వచ్చారు. వారి వెంబడిసే నడిచాడు కొంతదూరం వెళ్ళనిచ్చాడు. ఆ యువకుడు తనకు పరిచితు

డైన 'సుగుణాకరం' అని మాటలుబట్టి తెలుసుకున్న తర్వాత కొంత ధైర్యం వచ్చింది!

"ఏమండీ సుమిత్రగారూ – మంచిపని చేశారే!" అన్నాడు దగ్గరకువెళ్ళి. కొన్ని నిముషాలపాటు కలవరపాటు చెందిన సుమిత్ర గొంతు సవరించుకొని —

"అవునండీ- పొరపాటే జరిగింది. ఎంత చెప్పినా మా సరోజిని వింటేగా—పాపం తాతయ్య మిమ్మల్ని పంపించా ల్సి వచ్చింది.—నామూలంగా ఎంత శ్రమా" అంది తడబడుతూ, అనునయంగా!!!

"తాతయ్యా, అందరూ కంగారు పడుతున్నారు" అనికూడా నడిచాడు. దారిలో సరోజిని ఇల్లు! అక్కడ వాళ్ళను వదిలేసి, ఇద్దరూ ఇంటిదారి పట్టారు.

ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. కాని మనోహరం మ స్తిష్కంలో—ఎన్నో భావాలు, సముద్ర కెరటాల్లా వచ్చి-పోతున్నాయి. అతడు సుమిత్రతో నడుస్తున్నాడన్న మాటే గాని, ఆలోచనలు—"భవిష్యత్కాలంలో" పనిచేస్తున్నాయి.

వర్తమానంలో ఇద్దరూ ప్రక్క పక్కగా నడుస్తూ వెళ్తున్నారు. తాతగారు అప్పుడే వెనుకనుంచి వస్తున్నారు. ఆయన మొదట వెలుగులో నడుస్తున్న సుమిత్రను గుర్తుపట్ట గలిగారు. ప్రక్కనో యువకుణ్ణి చూసి, ఆయన వణికి పోయారు. మరో నిముషంలో ఆ ఇద్దరూ వెలుగులో నడు స్తున్నారు. వెళ్ళి—'కృతఘ్నురాలా' అని గొంతు నొక్కేయా

లనుకొన్న విశ్వేశ్వరయ్యగారు కళ్ళు తెరిచారు. ఎంతో బాధ హఠాత్తుగా తొలగిపోయినట్లు ఫీలయ్యారు. ఆ ఇద్దర్నీ అలా చూస్తుంటే ఎంతో ఆనందమైంది.

"వీరిద్దరూ దంపతులైతే—"అని ఆ క్షణాన్నే స్ఫురించిన తాతగారు ఆనందపరవశులయ్యారు,